క్లుప్తంగా

బెళుగుప్ప కేజీబీవీ తనిఖీ

బెళుగుప్ప: స్థానిక కేజీబీవీని ఎంపీడీఓ సుబ్బరాజు, ఎంఈఓ మల్లారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. కేజీబీవీలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థినులకు భోజనం నాణ్యతగా వడ్డించాలని, గుణాత్మకమైన విద్యనందించాలని ఎస్‌ఓ నాగరత్నబాయిని ఆదేశించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ దాసానాయక్

బ్రహ్మసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ దాసానాయక్, ఎంఈఓ కృష్ణనాయక్ సూచించారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సౌభాగ్య లక్ష్మీ, సిబ్బంది సత్యవతమ్మ, వార్డెన్ మంజుల పాల్గొన్నారు.

హైబ్రీడ్ పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ



కూడేరు: రైతులకు ప్రొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ విజయకుమార్

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఉచితంగా హైబ్రీడ్ పొద్దు తిరుగుడు (ఎన్‌డీఎస్‌హెచ్-1012) విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఏఓ విజయ కుమార్ మాట్లాడుతూ ఎన్‌డీఎస్‌హెచ్-1012 రకం పొద్దుతిరుగుడు విత్తనంతో పంట సాగు చేస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. పంట కాల వ్యవధి కూడా 3-4 నెలలు అన్నారు. ఎకరాకు 8-10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ రకం పొద్దుతిరుగుడు విత్తనంలో నూనె శాతం 40 వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ప్రమోద్‌సాయి, రైతులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

బెళుగుప్ప: బెళుగుప్ప గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్రాయికి వర్షాలు సకాలంలో కురిసి పంటలు పండాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం పూజలు నిర్వహించారు. బిందెలతో నీరును తెచ్చి బొడ్రాయికి అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక భజనలు నిర్వహించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కళ్యాణదుర్గం: మండలంలోని భట్టువానిపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన రైతులు నరసింహులు, వెంకటేష్, మహేంద్రకు చెందిన పొలాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. రైతులు లేని సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి, అందులోని రాగి వైరు ఎత్తుకెళ్లారు. నెలరోజుల్లోపు మూడు పొలాల్లో ఇలాంటి ఘటనలు జరిగాయని రైతులు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

కణేకల్లు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కణేకల్లు సెబ్ సీఐ మురళీకిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం కణేకల్లుక్రాస్‌లోని గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సెబ్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారమవుతోందన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ ప్రసాద్‌రావు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ రాజేష్, పీడీ తిరుపతయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ మద్దిలేటి

కంబదూరు: విద్యార్థుల వసతుల కల్పనలో నిర్లక్ష్యం సరికాదని నోడల్ ఆఫీసర్ మద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కేజీబీవీని ఏడీఏ యల్లప్ప, తహసీల్దార్ నిత్యానందబాబుతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలోని సదుపాయాలపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి 2024-25 విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా బోధించాలని ఉపాధ్యాయినులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పాఠశాలలో అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, ఎస్‌ఓ రూప, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఉల్లిసాగు

- గణనీయంగా పెరుగుతున్న సాగు
- జిల్లాలోనే గుమ్మఘట్టకు ప్రథమ స్థానం
- ఈ ఏడాది ఆరువేల ఎకరాల్లో సాగు అంచనా
- ఇప్పటికే నాలుగు వేల ఎకరాలకు చేరిన సాగు విస్తీర్ణం



సాగులో ఉన్న ఉల్లి పంట



రాయదుర్గం: జిల్లాలోనే ఉల్లిసాగుకు పెట్టింది పేరు గుమ్మఘట్ట మండలం. ఇక్కడ ఎంత తక్కువన్నా ఏటా 2 వేల నుంచి 2,500 ఎకరాలకు పైగా ఉల్లి పంట సాగు చేస్తారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, విపరీతమైన తెగుళ్ల, దిగుబడి ఉంటే ధర పతనం లాంటి కారణాలు వెరసి ఉల్లి రైతులు ఇన్నాళ్లూ డీలా పడ్డారు. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా లభిస్తాయనే నమ్మకం రైతుకు కలిగింది. ఈ నేపథ్యంలో గణనీయంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు ఆరు వేల ఎకరాలకుపైగా ఉల్లి పంట సాగులోకి వచ్చే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. విత్తనం చల్లింది మొదలు పంట చేతికందే వరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని అధికారులు చెప్పన్నారు. విత్తన శుద్ధి చేశాకే నాటుకోవడం మంచిదని వివరించారు.

ఎకరాలకు 300ల ప్యాకెట్లకు పైగా దిగుబడి

ఈ ప్రాంతాల్లో సారవంతమైన ఎర్ర నేలలు అధికంగా ఉన్నాయి. వాటిలో ఎకరాకు 300 ప్యాకెట్లకుపైగా ఉల్లి పంట పండిస్తారు. క్వింటాకు రూ.2 వేల ధర కలిసొచ్చినా రూ.2 లక్షలు చేతికందుతోంది. పదెకరాల్లో సాగుచేసిన రైతు రూ.20 లక్షలు ఆదాయం సమకూరుతుంది. ఈ విధంగా గతంలో ఒక్క ఆర్.కొత్తపల్లి లోనే రూ.2 కోట్లకు పైగా ఉల్లి ద్వారా ఆదాయం పొందారు. ప్రస్తుతం ఆ గ్రామంలో సాగు విస్తీర్ణం బాగా తగ్గింది.

ఎకరాకు 6 కిలోల ఉల్లి విత్తనాలు

ఎకరాకు ఐదు నుంచి ఆరు కిలోల ఉల్లి విత్తనాలు చల్లుతున్నారు. కిలో విత్తనం నాణ్యత ఆధారంగా రూ.1200 నుంచి రూ.1500లకు విక్రయిస్తున్నారు. కొందరు రైతులే విత్తనాన్ని సిద్ధం చేసుకొని చల్లుతున్నారు. మార్కెటింగ్ సదుపాయం లేక పండించిన పంటను కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, రాజమండ్రి మార్కెట్‌కు తరలిస్తారు. ప్రస్తుతం క్వింటా ఉల్లి ధర రూ.800 నుంచి రూ.1000 లోపు ధర పలుకుతోంది.

రెండెకరాల్లో సాగు చేశా..



ఈ ఏడాది రెండెకరాల్లో ఉల్లి సాగుచేశా. దిగుబడితో పాటు ధరలు కూడా ఆశాజనకంగా లభిస్తాయని నమ్ముతున్నాం. గడిచిన రెండేళ్ల తీవ్రంగా నష్టపోయాం. అయినా ఉల్లిపై మక్కువ చావడం లేదు. ఒకప్పుడు మా గ్రామంలో 200ల ఎకరాల్లో సాగులోకి వచ్చేది. ప్రస్తుతం చాలా తగ్గింది. ఒకప్పుడు ఉల్లిలోనే రైతులు రూ.కోట్లు లావాదేవీలు జరిపారు. నష్టాల కారణంగా ఇతర పంటల వైపు దృష్టి మళ్లించారు.

– హరినాథ్‌రెడ్డి, ఆర్.కొత్తపల్లి, గుమ్మఘట్ట మండలం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



జిల్లాలోనే అత్యధికంగా ఉల్లి పండే ప్రాంతం రాయదుర్గం. ఇక్కడ మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు రైతును ప్రోత్సహిస్తే మరింత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. కర్ణాటక సరిహద్దుకు ఆనుకొని గుమ్మఘట్ట ఉంది. ఈ భూభాగంలోని రైతులు ఉల్లి పంటను ఎక్కువ సాగు చేస్తారు. వారిని ఆదర్శంగా తీసుకోవడంతోనే మన ప్రాంతంలోనూ ఆశాజనకంగా ఉల్లి సాగు పెరుగుతూ వచ్చింది.

– బాలకృష్ణ, రైతు, ఆర్.కొత్తపల్లి, గుమ్మఘట్ట మండలం

ధార్మిక గురువు అబ్దుల్ బాసిత్ రియాజీ మృతి



అబ్దుల్ బాసిత్ రియాజీ

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన ధార్మిక మత గురువు అబ్దుల్ బాసిత్ రియాజి (83) గుండెపోటుతో శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందారు. శుక్రవారం పట్టణంలోని జామియా మహమ్మదీయ అహ్లె అదీస్ మసీదులో నమాజ్ అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో లోబీపీకి గురై చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు ప్రాణాలు కోల్పోయారు. ఈయన ప్రస్తుతం జామియా మహమ్మదీయ అహ్లెఅదీస్ మసీదు ప్రెసిడెంట్‌గా పని చేస్తుండగా, గతంలో ఏపీ జిమ్మితే అహలే హదీస్ మాజీ ప్రెసిడెంట్, జామియా మహమ్మదీయ అరబిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అబ్దుల్ బాసిత్ రియాజి సేవలందించారు. ఈయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ముస్లింలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన సేవలను కొనియాడారు. జామియా మహమ్మదీయ అహ్లె అదీస్ మసీదులో శనివారం మధ్యాహ్నం జోహర్ నమాజ్ అనంతరం బళ్లారి రోడ్డు ఖబరస్థాన్‌లో అంత్యక్రియలు (నమాజ్ ఏ జనాజా) నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో శుక్రవారం సాయంత్రం రమేష్‌ప్రసాద్ (35) ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. స్థానికంగా ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలతోపాటు ఇంట్లో గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో రమేష్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయండి



బ్రహ్మసముద్రంలో మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి



కరకముక్కలలో సేవ్ ట్రీ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

- డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

బ్రహ్మసముద్రం : విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని పిల్లలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, నాడు-నేడు పనుల వివరాలను ప్రధానోపాధ్యాయులు అశోక్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్, ఎంఈఓ- 2 కృష్ణానాయక్, ఏపీఓ అవినాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కవిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్కలు నాటాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి విద్యార్థీ తల్లి పేరుతో మొక్కలు నాటాలని జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మల్లికార్జునతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూడేరు: మండల పరిధిలోని కమ్మూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 'వనమహోత్సవం'లో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ నీలవేణి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. హెచ్‌ఎం రవిశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గం జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణ

బెళుగుప్ప: స్థానిక ప్రభుత్వ పశువైద్యశాల ఆవరణలో పశువైద్యసిబ్బంది శుక్రవారం మొక్కలు నాటారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడారు.కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి

కంబదూరు: విద్యార్థులు బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 'హరిత అనంతపురం' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

విడపనకల్లు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని హెచ్‌ఎం గురుసిద్ధమూర్తి అన్నారు. శుక్రవారం కరకముక్కల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పచ్చని మొక్కలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీ మంజునాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కణేకల్లు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ గూడెన్న పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని బ్రహ్మసముద్రంలో అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. రోడ్డు ఇరువైపులా ఏపీఓ సుధాకర్‌తో కలిసి ఎంపీడీఓ మొక్కలను నాటారు. టెక్నికల్ అసిస్టెంట్ సోమన్నగౌడ్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మలాలా యూసఫ్ జాయ్ దినోత్సవం

ఉరవకొండ: అత్యంత చిన్న వయస్సులో నోబుల్ శాంతిబహుమతి పొందిన పాకిస్తాన్ సాహస బాలిక, సామాజిక కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. శుక్రవారం ఉరవకొండ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో మలాలా వేషధారణలో విద్యార్థినులు అలరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, లైబ్రేరియన్ కుళ్లాయమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మలాలా ప్రపంచ వ్యాప్తంగా ఇంత గుర్తింపు ఎందుకు తెచ్చుకున్నారో ప్రిన్సిపాల్ వివరించారు. మలాలా జ్ఞాపికంగా ఒక మొక్కను నాటారు.

ముద్ద చర్మవ్యాధి ప్రమాదకరం



గోనబావిలో పశువులకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

కుందుర్పి: సీజనల్ వ్యాధుల్లో భాగంగా పశువులకు సోకే ముద్ద చర్మ వ్యాధి అత్యంత ప్రమాదకరమని స్థానిక పశు వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు బండమీదపల్లి తదితర గ్రామాల్లో స్థానిక సర్పంచ్ మారుతేశ్వరీ ఆధ్వర్యంలో పశువులకు ముద్ద చర్మవ్యాధికి టీకా వేసినట్లు తెలిపారు. నాలుగు రోజులుగా మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 1,785 పశువులకు తమ సిబ్బంది టీకా వేసినట్లు తెలిపారు.

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి, కోనాపురం, బీటీపీ గ్రామాల్లోని 415 పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకా వేసినట్లు పశువైద్యులు నవీన్‌కుమార్ శుక్రవారం తెలిపారు.పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణకు ముందస్తుగా టీకా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రహ్లాద, భవ్య, అశోక్, ఫక్కీరప్ప, ప్రవీణ్, ఆసిఫ్, హరి, తిప్పేస్వామి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

గుమ్మఘట్ట: సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని ఆయుష్ వైద్యులు రాధాకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

విడపనకల్లు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, దోమల వల్ల మలేరియా, డెంగీ వంటి జ్వరాల వస్తాయని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాల్తూరులో వైద్య సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటా తిరుగుతూ ప్రతి ఒక్కరూ కూడా డ్రైడే పాటించాలని సూచించారు. కార్య క్రమంలో పాల్తూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకర్,ఆరోగ్య సిబ్బంది,ఆశా వర్కర్లు,ఆయాలు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై ఈఓ గౌస్ సాహెబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈఓ గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి, వారం రోజులకు పైగా నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. అనంతరం ఆశా, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

బొమ్మనహాళ్: డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని బండూరు గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భగా వైద్యులు మాట్లాడుతూ డయేరియాను నిర్లక్ష్యంగా చేస్తే ప్రమాదకరంగా మారుతందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక లాల్‌స్వామి పీర్లు

ఉరవకొండ: పట్టణంలోని నాల్గో వార్డు లాల్‌స్వామిపీర్లు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఏటా నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా జిల్లా నలమూలల నుంచి మొహర్రం వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల చావడి తరహాలో ఇక్కడ పీర్ల చావిడి పక్కనే చౌడేశ్వరి అమ్మవారి ఆలయం కొలువు తీరింది. ఈనెల 17న స్వామి వారి పెద్ద సరిగెత్తు సందర్భంగా భక్తులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

గుమ్మఘట్ట: గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తిశ్రద్ధలతో పీర్ల స్వాములకు కానుకలు సమర్పించి, కులమతాలకతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఉరవకొండలోని లాలుస్వామి పీర్ల చావిడి, పక్కనే చౌడేశ్వరిదేవి ఆలయం

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

బొమ్మనహాళ్: కులమతాలకతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్,కురువల్లి, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కల్‌హోళ, గోనేహాళ్, శ్రీధరఘట్ట తదితర గ్రామాల్లో పీర్లు ప్రతిష్ఠించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కనుకూరులో మాట్లాడుతున్న సీడీపీఓ వనజాఅక్కమ్మ

సెట్టూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ వనజా అక్కమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కనుకూరు గ్రామంలోని ఉన్న పాఠశాలలో బాల్య వివాహాలను అరికడదాం- ఆడపిల్లలను కాపాడుకుందాం అనే కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చిన్న వయస్సుల్లో పెళ్లి చేయడం వల్ల అనర్థాలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీంలీడర్ సుశీలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, హెచ్‌ఎం సుధ, వైద్య సిబ్బంది సరోజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు వనిత, శ్రావణి, ఏఎన్‌ఎం చంద్రప్రభ, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వెంగమ నాయుడి వర్ధంతి

కూడేరు: సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కూడేరులో కామ్రేడ్ వెంగమనాయుడు 27వ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాశీం పీరా, సీనియర్ నేత ముట్టాలు శ్రీరాములు. వ్యవసాయ కార్మిక సంఘం తాలుకా కార్యదర్శి మలరాయుడు, చోళసముద్రం కార్యదర్శి ముత్యాలన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వజ్రకరూరు: మండలంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ షెక్షావలి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

లైసెన్స్ ఉన్న మందులే విక్రయించాలి

ఉరవకొండ: మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు లైసెన్స్ కలిగిన పురుగుల మందులను మాత్రమే అమ్మాలని ఏఓ శుభకర్ సూచించారు. శుక్రవారం స్థానిక వీరశైవ కళ్యాణమండపంలో ఫర్టిలైజర్స్ షాపు యజమానులతో ఏఓ సమావేశమయ్యారు.

సంక్షిప్త సమాచారం

చురుగ్గా సామాజిక తనిఖీ

కూడేరు: మండలంలో 2023-24 ఏడాదిలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.7.56 కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. అందులో కూలీలకు వేతన రూపంలో రూ.4.25 కోట్లు, మెటీరియల్ ఖర్చులకు రూ.3.4 కోట్లు చెల్లించారు. ఈ పనులపై క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం 14 పంచాయతీల్లో సామాజిక తనిఖీ డీఆర్పీలు పర్యటించి, తనిఖీలు చేశారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ, 11 మంది జిల్లా రీసోర్స్ పర్సన్లు, ఉపాధి, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఇన్‌సినరేటర్ వితరణ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు సర్పంచు మోనాలిసా శుక్రవారం ఇన్‌సినరేటర్ (శానిటరీ ప్యాడ్స్ దహనం చేసే పరికరం) అందజేశారు. సర్పంచు మోనాలిసా మాట్లాడుతూ ఇన్‌సినరేటర్‌ను విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. ఈఓఆర్డీ సదాశివ, హాస్టల్‌వార్డెన్ సుగుణమ్మ, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, స్వచ్ఛభారత్‌మిషన్ కోఆర్డినేటర్ శివశంకర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కణేకల్లు: కళేకుర్తి గ్రామశివారులో ఉన్న వేదవతి హగిరి నుంచి ఇసుకను అక్రమంగా తీసుకెళుతున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కణేకల్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వేదవతి హగిరిలో ఇసుక అక్రమంగా లోడింగ్ చేసుకొని తీసుకెళ్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికెళ్లి ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. వేదవతి హగిరి నుంచి ఉరవకొండకు ఈ ట్రాక్టర్లు వెళ్తున్నాయని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వేదవతి హగిరి నుంచి ఇసుక అక్రమంగా తీసుకెళ్లితే చట్టపరమైనచర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

కారు ఢీకొని గేదెల మృతి

రాయదుర్గంటౌన్: పట్టణ సమీపంలోని పైతోట వద్ద జాతీయ రహదారిపై కారు ఢీకొని నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన శుక్రవారం ఉదయం 7 గంటలకు జరిగింది. వివరాలు.. పైతోటకు చెందిన రైతు ఆంజనేయులు చెందిన పాడి గేదెలు రోడ్డు దాటుతున్న సమయంలో మొలకాల్మూరు వైపు రాయదుర్గం వైపుకు వేగంగా వెళ్తున్న కారు ఢీకొనింది. ప్రమాదం జరిగిన సమయంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని, కారు ముందు భాగంగా దెబ్బతిన్నట్లు చెప్పారు. కాగా రైతుకు కారు యజమానులు నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు తెలిసింది.

మానవ మృగాలను శిక్షించాలి



వాల్మీకి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

రాయదుర్గం: నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో చిన్నారిపై సామూహిక అత్యాచారం జరిపి హత్యచేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంక్షేమ సేవా సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారి మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వాల్మీకి సంక్షేమ సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ బోయ మల్లికార్జున, పైగేరి హమాలి యూనియన్ అధ్యక్షులు కురువ శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీ పవన్‌కుమార్, సంఘం నాయకులు ఒబా నాగరాజు, మల్లి, గంగాధర మాట్లాడారు. ఎనిమిదేళ్ల చిన్నారిపై సామూహిక అత్యాచారం చేసి నీటి కాలువలో పడేయడం దారుణమని మండిపడ్డారు. చిన్నారి మృతదేహాన్ని వెలికితీసి తల్లిదండ్రులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే వాల్మీకులంతా ఉద్యమిస్తామని హెచ్చరించారు.